క్లుప్తంగా

రజకుల సమస్యలపై విచారణ హర్షణీయం

ఏలూరు (టూటౌన్): రజకుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం పట్ల రజక జన సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల దెందులూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రజకులు సమస్యలపై వినతి పత్రం అందించామని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఇచ్చిన ఆదేశాలతో ఏలూరు జిల్లా వెనుకబడిన సేవా సహకార సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ పుష్పలత రజకుల సమస్యలపై విచారణ నిర్వహించి ది మేనేజింగ్ డైరెక్టర్ ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విజయవాడకు బుధవారం రిపోర్టు చేయడం అభినందనీయమన్నారు. విచారణ కాపీని పుష్పలత తనకు అందజేసినట్టు చెప్పారు. రజకులకు రక్షణ చట్టం తెచ్చేందుకు, మెట్ట ప్రాంతాల్లోని వృత్తి చెరువుల వద్ద మోటారు బోరు, విద్యుత్ కనెక్షన్లు మంజూరుకు, రజక విశ్రాంతి భవనాలు, దోబీ ఘాట్స్ ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్లు నిధుల కేటాయింపు తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని కట్లయ్య వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): వేస్ట్ పిక్కర్స్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని మెప్మా టెక్నికల్ కోఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి కోరారు. స్థానిక నరసింహారావు పేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద వేస్ట్ పిక్కర్స్, ప్రభుత్వ అధికారుల ముఖాముఖీ కార్యక్రమం బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏలూరు కోఆర్డినేటర భలే సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఝాన్సీరాణి మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్ మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి పొదుపు చేసుకుని తద్వారా అభివృద్ధి, గౌరవం పొందాలన్నారు. ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఏపీఓ నాయుడు మాట్లాడుతూ పిల్లలను చదివించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని సూచించారు. పిల్లల ఆధార్ సమస్యలు, స్కూల్ ఎన్రోల్మెంట్, హాస్టల్స్ సదుపాయాలు ఉచితంగా కల్పిస్తామన్నారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారి ఎ.వరప్రసాద్ మాట్లాడుతూ యానాదుల కుటుంబాలలో చేపలు పట్టుకుంటున్న వారికి లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ ఉచితంగా చేయించుకోవాలని కోరారు. డీబీఆర్సీ రీజినల్ కోఆర్డినేటర్ రమాదేవి, ట్రైనింగ్ కోఆర్డినేటర్ హేమలత, ఏఈ పి.శ్రీనివాస్, డీబీఆర్సీ సిబ్బందిఝాన్సి పాల్గొన్నారు.

అభివృద్ధి సోపానాలు.. ప్రభుత్వ బడులు

- విద్యార్థులకు సకల సౌకర్యాలతో సత్ఫలితాలు
- టెన్త్ ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- ప్రజా సేవకు పునరంకితమౌతామంటున్న ఆణిముత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ప్రభుత్వ బడులను అభివృద్ధి సోపానాలుగా మార్చుతోంది. నాడు - నేడు కార్యక్రమంతో పాఠశాలలు సుందర నందన వనాలుగా రూపొందించారు. స్వచ్ఛమైన గాలి, వెలుతురు, విద్యార్థులకు ఫ్యాన్లు, మినరల్ వాటర్‌తో తాగునీటి సౌకర్యాలు, ఆరోగ్యకరమైన క్రీడా ప్రాంగణాలు ఒక్కొక్కటిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ అభివృద్ధి నిరంతర ప్రక్రియలా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుపైనే ఏకాగ్రత చూపి ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగింది. 600 మార్కులకు 590 నుంచి 580 వరకు అనేక మంది విద్యార్థులు మార్కులు సాధించారు. దీనిని ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి నిదర్శనంగా చెప్పవచ్చు.

ప్రజా సేవకు పునరంకితం

కాగా, జగన్ మామ ఆశయాలను కొనసాగిస్తూ.. ప్రజా సేవకు పునరంకితమౌతామని జగనన్న ఆణిముత్యాలు (టెన్త్‌లో నియోజకవర్గ టాపర్లు) చెబుతున్నారు. ప్రభుత్వ బడుల్లో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులందరిదీ ఒకే మాటగా, సేవామార్గంలో తమకు జగన్ మామే ఆదర్శంగా నిలుస్తారని చెబుతున్నారు. వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు (ఫైల్)

బోధన అత్యద్భుతం



పదో తరగతిలో 581 మార్కులు సాధించి నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉంది. ఇదంతా పాఠశాలలో ఉపాధ్యాయుల అత్యద్భుత బోధనతోనే సాధ్యమైంది. మా పాఠశాలలో ఎంతో ప్రశాంత వాతావరణం ఉంటుంది. అన్ని సౌకర్యాలూ అందుబాటులో ఉండడంతో చదువుపైనే ఏకాగ్రత చూపడానికి అవకాశం ఏర్పడింది. భవిష్యత్‌లో సివిల్స్ సాధించి ప్రజా సేవ చేయాలని ఉంది.

– కొనరాజు చిన్మిత, కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల, ఏలూరు

సివిల్స్‌తో పేదలకు అండగా..



అమ్మానాన్నల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి నా విజయంలో కీలక అంశాలు. వారి అండదండలతోనే వివిధ పోటీ పరీక్షల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయి. సివిల్స్ రాసి ఐఏఎస్, ఏపీఎస్ వంటి సర్వీసుల్లో చేరి పేదలకు సేవ చేస్తూ వారికి అండగా నిలవాలనేది నా ఆశయం. అందుకు మంచి పునాది జిల్లా పరిషత్ పాఠశాలలో పడిందని చెప్పగలను. టెన్త్‌లో 581 మార్కులు వచ్చాయి.

– పూసా చరణ్ నాగ కృష్ణతేజ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్రంపాడు

కలెక్టర్ కావాలనేది నా కల



కలెక్టర్ కావాలనేది నా కల. దానిని సాకారం చేసుకోవడానికి ఇప్పటి నుంచే పట్టుదలతో చదువుతున్నాను. నా పట్టుదలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివినా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఉపాధ్యాయులు ఆరోగ్యకర పోటీతత్వం నేర్పుతున్నారు. మా పాఠశాలలో నాతోటి విద్యార్థులు కూడా ఎక్కువ మార్కులు సాధిస్తున్నారు. నాకు 576 మార్కులు వచ్చాయి.

– తూములూరి షణ్ముఖ్ జితేంద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్రంపాడు

అభివృద్ధిలో భాగస్వామినవుతా



ప్రపంచ సాంకేతిక రంగంలో భారత పాత్ర ఎంత కీలకంగా ఉందో చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే సాంకేతిక రంగాన్ని శాసించే స్థాయిలో భారతీయులమున్నాం. దీనిని భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తూ మన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఐఐటీలో చేరి సాంకేతిక రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు భారత సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామిగా నిలవాలనేది నా కోరిక. నాకు 570 మార్కులు వచ్చాయి.

– నారాయణం మాధవ సాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్రంపాడు

త్వరలో పోలవరం నుంచి పాదయాత్ర

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిధుల కోసం, నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీ తదితర సమస్యల పరిష్కారానికి త్వరలో పోలవరం నుంచి అమరావతి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ చెప్పారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో బుధవారం సాయంత్రం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలించి, పోలవరం ప్రాజెక్టు కోసం ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ఈనెల 28న విజయవాడలో సమావేశమై పాదయాత్రపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఎకరాకు రూ.5 లక్షలు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి బదులు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంతంలోని విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు గురువారం నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుంచి 8.30 గంటల వరకు పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రామచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనుక రోడ్డు, ఏటిగట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, అశోక్ నగర్, పత్తేబాద, ఫైర్ స్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సాహితి మండలిలో నేడు కార్మిక సభ



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఇఫ్టూ నేత వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జూట్ కార్మికులకు న్యాయమైన పరిష్కారం చేయకుండా మిల్లు ఆస్తులపై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయబోతున్న యాజమాన్య చర్యను ఖండిస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించే కార్మిక సభను విజయవంత చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక కొత్తూరు జూట్ మిల్లు వద్ద బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక రామకృష్ణాపురం సాహితి మండలిలో నిర్వహించే కార్మిక సభకు కార్మికులంతా హాజరవ్వాలన్నారు. సంవత్సరాల తరబడి కష్టపడి యాజమాన్యం ఆస్తులు పెరగటానికి కారణమైన కార్మికులకు సరైన న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. కొత్తూరు జూట్ మిల్లుకు నార కొనకుండా ఇబ్బంది పెట్టడాన్ని ఆయన విమర్శించారు. ఏలూరు జూట్ మిల్లు కార్మికులకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కొత్తూరు జూట్ మిల్ యూనియన్ నాయకులు వై.నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రాము, త్రినాథ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ హుండీ లెక్కింపు

పెదవేగి : రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానం తాలూకా హుండీని బుధవారం లెక్కించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ వారి హుండీని 62 రోజులకుగాను వచ్చిన సొమ్ము రూ. 11,59,150 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చళ్ళగొళ్ల వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తలు గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్ధనరావు, నాగార్జున లక్ష్మీరాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, రాట్నాలకుంట ప్రెసిడెంట్ జెట్టి వెంకటేశ్వరమ్మ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, రాయన్నపాలెం సర్పంచ్ పర్వతనేని రమాదేవి, కొండలరావు ప్రెసిడెంట్ పాలడుగు సత్యవతి, ఎంపీటీసీలు దేవళ్ళరాజు రాధిక, మట్టా రాగిణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



జగనన్నకాలనీ అభివృద్ధి పనులను వివరిస్తున్న తహసీల్దార్ సోమశేఖర్



ఎల్లో మీడియా రాతలను ప్రశ్నిస్తున్న రామారావు, రఘు

ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృవద్ధి పనులను త్వరితగతిని పూర్తి చేయాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి నేతృత్వంలో బుధవారం నిర్వహించిన ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతోన్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరూ చూస్తున్నారని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని వివరించారు. ఎల్లో మీడియా అసత్య వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని, దీన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు మాట్లాడుతూ గ్రామంలో సుమారు మూడు కోట్లు ఖర్చు చేసి ఇంటింటికీ కుళాయి, ప్రత్యేక పైప్‌లైన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయ నిర్మాణం, జగనన్నకాలనీ లెవెలింగ్, స్థలాల పంపిణీ, గ్రావెల్ రోడ్డు, ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు చేపట్టినప్పటికీ పచ్చపత్రిక పేరు గొప్ప ఊరు దిబ్బ అంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. జగనన్నకాలనీ అభివృద్ధిపై తహసీల్దార్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో శ్రీపర్రు, ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక, మొండికోడు తదితర మొత్తం 7 లేఅవుట్‌లో లెవెలింగ్ పనులు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. హౌసింగ్ అధికారులు రోడ్లు అభివృద్ధి చేస్తారన్నారు. తర్వాత ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విద్యుత్, నీటి వసతి కల్పిస్తారని సభ్యులకు వివరించారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ఏఓ జీవనసంధ్య వెల్లడించారు. చాటపర్రు, మాదేపల్లి, శ్రీపర్రు, కోమటిలంక సర్పంచ్‌లు గుడిపూడి రఘు, శ్రీరామ్‌ప్రభుదేవ, సైదు భాగ్యలక్ష్మి, తెనాలి యోహాన్ సూచనల మేరకు పైప్‌లైన్ మరమ్మతులు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ అన్నారు. జెడ్పీటీసీ మండల సరస్వతి, ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కొండలరావు, తేరా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	07–08
బెండకాయలు	16	కంద	52
పచ్చిమిర్చి	44–50	బీట్‌రూట్	38
కాకర కాయలు	48	కీరా దోస	40
బీరకాయలు	20	ఫ్రెంచ్‌బీన్స్	92
బీరకాయలు (పందిరి)	36	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	16	బజాజీ	--
అనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	10
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	15

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	19
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	26
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	36
ఏలూరు –తిరుపతి	16.00	4830	36

కూలీలకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

పెదపాడు: మండలంలోని సకల కొత్తపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనులు సకల కొత్తపల్లి గ్రామంలో ముమ్మురంగా సాగుతున్నాయి. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ కూలీలకు మజ్జిగను అందించారు. వేసవి కాలం ఎండ తీవ్రంగా ఉండటంతో మజ్జిగ పంపిణీ చేయడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు పీ శ్రీనివాసరావు(పీఎస్ఆర్) అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నాలుగు వేల కిలోల పాత దుస్తుల సేకరణ

ఏలూరు టౌన్: మేరీ లైఫ్ – మేరీ స్వచ్ఛ హెహర్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు కార్పొరేషన్ పరిధిలో బుధవారం రీయూజ్ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ట్రిబుల్ ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్) కార్యక్రమం అమలు చేస్తున్నారు. నగరంలోని 79 సచివాలయాల్లోనూ ట్రిబుల్ ఆర్ సెంటర్లను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది రీయూజ్‌లో భాగస్వాములయ్యారు. 24న రీయూజ్ కార్యక్రమం చేపట్టగా నగరంలో నాలుగు వేల కిలోల పాతబట్టలను సేకరించి ట్రిబుల్ ఆర్ కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ట్రిబుల్ ఆర్ సెంటర్లలో సేకరించిన పాతబట్టలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తమ ప్రతిభ కనబరచాలని, ఉత్తమ సేవకులుగా నిలవాలని కమిషనర్ కోరారు. ప్రజలు సమీపంలోని వార్డు సచివాలయంలోని ట్రిబుల్ ఆర్ సెంటర్లలో తమ వంతు బాధ్యతగా పాతబట్టలను ఇవ్వాలని కమిషనర్ తెలిపారు.



సచివాలయంలో సేకరించిన పాతబట్టలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ



15వ డివిజన్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు 15వ డివిజన్‌లోని స్వచ్ఛంద సంస్థ వద్ద మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. భవిష్యత్తు తరాల కోసం మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని రాము అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నీరు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరినీ చైతన్యం చేయాలని కోరారు. తొలుత ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక గ్రూపులు, వలంటీర్లు పర్యావరణ కాపాడుతాం అంటూ ప్రతిజ్ఞ చేశారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- అక్కిరెడ్డిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



అక్కిరెడ్డిగూడెంలో ఉప్పలూరి మరియమ్మ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని, గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని మరెన్నో కార్యక్రమాలను నూతన పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన, గిరిజన, మైనార్టీ వర్గాలకు అపద్బాంధువుడుగా అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తూ సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. ప్రతి కుటుంబంలో నాలుగేళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, మీకు మంచి జరిగితేనే మా ప్రభుత్వానికి ఓటు వేయండని మేము ధైర్యంగా ప్రతి కుటుంబానికి చెబుతున్నామంటే మా ప్రభుత్వ పనితీరు ఎంత పారదర్శకంగా పేదల పక్షాన ఉందో గమనించాలన్నారు. నాలుగేళ్లు చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఇంకా ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో మిగిలి ఉన్న సమస్యలు పరిష్కరించాలన్న దూరదృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కొలుసు గణపతిరావు, నల్లూరి వెంకట్రామయ్య (బాబి), సంపంగి వేణుగోపాల్ తిలక్, సప్పా మురళి, శనపల్లి రామకృష్ణ (విష్ణు), కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఏనుగు అంజలి ప్రసాద్, తోట వెంకన్న, వార్డు మెంబర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: గాలాయగూడెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాని తెలిపారు.